క్లుప్తంగా

16 నుంచి మహాభారత ఉత్సవాలు

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవ గ్రామంలో ఉన్న శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఈ నెల 16 నుంచి మహా భారత ఉత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకుడు తారక్ రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16న ధ్వజారోహణంతో ప్రారంభమై పది రోజులపాటు మధ్యాహ్నం హరికథ కాలక్షేపం, రాత్రి వీధి నాటక ప్రదర్శన ఉంటాయన్నారు. 16న పాండవుల జననం, 20న బండి కుంభాలు, 21 ద్రౌపదీ కల్యాణోత్సవం, 23న అర్జున తపస్మాన్, 25న ఉత్తర గోగ్రహణం, 27న దుర్యోధన వధ కార్యక్రమాలతో ముగుస్తుందన్నారు. ఈ మేరకు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నామన్నారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు


హోమ పూజల్లో భక్తులు

నింద్ర: మండలంలోని కునమరాజుపాళెం గ్రామంలో శనివారం శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉదయం పౌర్ణమి పూజలు నిర్వహించారు. అలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. అదే విధంగా నేడు హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భజనలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పేడదిబ్బల తొలగింపు

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. శనివారం ఎస్ఆర్ఆర్ కండ్రిగలో రోడ్డు ఇరువైపులా, ముళ్ల కంపలు, పేడదిబ్బలు తీస్తున్న కార్యాక్రమాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రోడ్లపైన వ్యర్థాలు ఎవరూ వేయకుండా ఎప్పటికప్పుడు ఇంటి వద్దే సేకరించేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా పేడదిబ్బలు వేయకుండా చూడాలని తెలిపారు. ముఖ్యంగా గ్రీన్ అంబాసిడర్లు చెత్త నుంచి సంపద తయారీపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, సుధ, శంకర్ పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అల్లాడిపోతున్న ప్రజలు
- శీతల పానీయాలు, కొబ్బరి బోండాంలకు పెరిగిన గిరాకీ
- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు



శీతల పానీయాల వాహనం వద్ద జనం, (ఇన్‌సెట్) కొబ్బరి బోండాల వాహనం వద్ద జనం

భానుడు భగ్గుమంటున్నాడు. ఎండలు మండుతున్నాయి. పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటోంది. బయటకు వెళ్లాలన్నా భయపడే పరిస్థితి ఎదురవుతోంది. గొడుగులో, టోపీలో లేకుండా బయటకు వెళితే ఉష్ణోగ్రతను తట్టుకోలేని పరిస్థితి కనిపిస్తోంది. ఉష్ణోగ్రత పెరగడంతో ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్నవారు ఏసీ గదుల్లోనే గడిపేస్తుంటే కొందరు చల్లదనం కోసం మధ్యాహ్నం ఏసీ సినిమా థియేటర్లకు వెళుతున్నారు. పలు ప్రాంతాల్లో దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఎండలో వెళ్లేవారి దాహార్తి తీరుస్తున్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రజలను అప్రమత్తం చేసేందుకు అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల పరిధిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేస్తోంది.

–నగరి

వడదెబ్బ లక్షణాలు

వేసవిలో ప్రజలు త్వరితగతిన వడదెబ్బకు గురవుతారు. చర్మం పొడిబారడం, చెమటలు పట్టకపోవడం, తడి ఆరకపోవడం, నాడి అధికంగా కొట్టుకోవడం, స్పృహ కోల్పోవడం, శరీర ఉష్ణోగ్రత అమాంతం పెరిగిపోవడం తదితర లక్షణాలు వడదెబ్బ తగిలిన వారిలో కన్పిస్తాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు తదితర జబ్బులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లటి వాతావరణంలోకి తీసుకెళ్లాలి. చల్లటి తడి నీటి గుడ్డతో తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చే వరకు చల్లటి ప్రదేశాల్లో ఉంచాలి. వ్యక్తి పరిస్థితి తీవ్రమైతే దగ్గరలోని ఆసుపత్రికి తీసుకుని వెళ్లాలి. ఓఆర్ఎస్, గ్లూకోజ్, కొబ్బరి నీళ్లు, అందించాలి. అత్యవసర పనులు లేనివారు మండు వేసవిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు బయట తిరగకూడదు. ఒకవేళ వెళ్లినా తలపై టోపీ లేదా గొడుగు తప్పకుండా ఉపయోగించాలి. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు ఎండలో తిరగకపోవడం మంచిది. రోజూ 4 లీటర్ల నుంచి 5 లీటర్ల మంచి నీరు తప్పనిసరిగా తాగాలి.

జింక్ ఓఆర్ఎస్ కార్నర్ ఏర్పాటు



వేసవిలో సంభవించే వడదెబ్బ బాధితుల కోసం ఆస్పత్రుల్లో జింక్ ఓఆర్ఎస్ కార్నర్లను ఏర్పాటు చేశాం. వడదెబ్బ బాధితులకు తగిన వైద్యం అందించడంతో పాటు త్వరగా కోలుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి. ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సిబ్బందికి వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ అందించాం. అంతేకాకుండా వడదెబ్బకు గురైన వారికి అందించాల్సిన చికిత్సలపై కూడా వారికి అవగాహన కల్పించడంతో పాటు ప్రాణాపాయం లేకుండా వారిని వెంటనే సమీపంలోని వైద్యశాలకు చేర్చేలా సూచనలు ఇచ్చాం. –డాక్టర్ ప్రభావతి, మెడికల్ సూపరింటెండెంట్, నగరి ఏరియా ఆస్పత్రి

వైద్యుల సూచనలు తప్పనిసరి



గతంలో కంటే ఎండ తాపం అధికంగా ఉంది. జీవన, ఆహార శైలిలో మార్పులు తప్పక చేసుకోవాలి. సురక్షిత ప్రమాణాలు పాటించాలి. వడదెబ్బ తగిలినప్పుడు దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తక్షణ వైద్యం తీసుకోవాలి. సాధారణ జ్వరం వచ్చినప్పుడు అందించే మందులు వాడొద్దు. వైద్యుల సూచనలతో ఐవీ ఫ్లూయిడ్స్ లాంటివి వాడుతూ వైద్య సాయం తీసుకోవాలి.
–రమేష్, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ, బుగ్గఅగ్రహారం

పిడుగు పాటుకు కొబ్బరి చెట్టు దగ్ధం


పిడిగుపాటుకు దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

పెనుమూరు(కార్వేటినగరం): పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు దగ్ధమైన సంఘటన పెనుమూరు మండల పరిధిలోని దాసరపల్లిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు మండలంలో అకాలంగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి జల్లులు పడ్డాయి. దీంతో దాసరిపల్లిలో అకస్మాత్తుగా మెరుపులతో కూడిన పిడుగు కొబ్బరి చెట్టుపై పడడంతో మంటలు చెలరేగాయి. దీంతో కొబ్బరి చెట్టు కాలిపోయింది.

పెట్రోల్ ధరలు తగ్గించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నగరి: పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తూ పేదలపై భారాల మోస్తున్న కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి నశించాలన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, బాషా, విజయకుమార్, ఏఐటీయూసీ నాయకులు శేఖర్, ఏసు, లాజరు, గోవింద రెడ్డి, మణీ, జార్జ్, అములు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తేయాలి


నిరసన తెలుపుతున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు


అంబేద్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టుల నిరసన

గంగాధరనెల్లూరు: సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డి, ఆరుగురు జర్నలిస్టులపై అక్రమంగా నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలంటూ నియోజకవర్గ కేంద్రంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బస్టాండ్ కూడలి నుండి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి సీఐ శ్రీనివాసంతికి వినతి పత్రాన్ని అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులపై కేసులు పెట్టడం ఎక్కువయ్యాయని ఆరోపించారు. అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఏపీయూడబ్ల్యూజే యూనియన్ తరఫున భారీ ఎత్తున నిరసనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జయప్రకాష్, జిల్లా ఈసీ మెంబర్ రమేష్, వెంకటేష్, తిరుమల, ఎంజీఆర్, రఘునాథ రెడ్డి, నరేష్, రాజయ్య, విజయ్‌కుమార్, రాజేంద్రన్, మహేంద్ర, తేజ, విజయ్‌కుమార్, సతీష్, సీనియర్ జర్నలిస్టు శివ చంద్రారెడ్డి, జయచంద్ర నాయుడు, శేఖర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నగరిలో..

నగరి: రాష్ట్ర ప్రభుత్వం 'సాక్షి' దినపత్రికపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డితోపాటు మరో ఆరుగురు రిపోర్టర్లపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో కొండచుట్టు మండపం సమీపంని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. కక్షపూరిత విధానాలను ప్రభుత్వం విడిచిపెట్టాలన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధానాలను ప్రభుత్వం విడిచిపెట్టాలన్నారు. జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి ఇలాంటి సంఘటనలను ఎదుర్కోవాలన్నారు. నిరసన అనంతరం డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహ కార్యదర్శి చంద్రమోహన్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు సుబ్రమణ్యం, ఆలిండియా జర్నలిస్టు ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వీటీ భాస్కర్, పాత్రికేయులు గోపి, విద్యాసాగర్, రామూర్తి, శ్రీధర్, భాగ్యరాజ్, బాషా, మోహన్, సెంథిల్, మైలుస్వామి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో కూటమి విఫలం


చిన్నబ్బను పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: పింఛన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని టీటీ కండ్రిగ గ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న చిన్నబ్బ కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ వెరిఫికేషన్ పేరుతో పక్షవాతం, డయాలసిస్, పుట్టుకతో దివ్యాంగులైన వారిని హింసిస్తున్నారని ధ్వజమెత్తారు. టీటీ కండ్రిగ గ్రామంలో కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న గురవమ్మను పరామర్శించారు. ప్రభుత్వం పక్షవాతంతో బాధ పడుతున్న వారికి వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, తులసి, చందురాజు, సర్పంచ్‌లు సర్వేశ్వర్, ధనుంజయవర్మ, మాజీ సర్పంచ్ ధర్మయ్య, పురంధర్, రాము, చిరంజీవి రెడ్డి, గురుస్వామిరెడ్డి, రాజ, నందగోపాల్, సుందర్‌రాజ్, .శేఖర్, ప్రేమనాథరెడ్డి, లడ్డు, లవకుమార్ మునికృష్ణ, వెంకటరత్నం, శ్రీనివాసులు, గోపి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు


ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ విక్రమ్

నగరి: ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని సీఐ విక్రమ్ అన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో నగరి టౌన్, సత్రవాడ, ముడిపల్లి, నాగలాపురం, నాగరాజకుప్పం, మంగాడు రూట్లలో ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో నడిపే వ్యక్తి కచ్చితంగా యూనిఫామ్ ధరించాలన్నారు. ఏకాంబరకుప్పం రైల్వే గేట్, సత్రవాడ వద్ద రోడ్‌పైన వాహనాలు నిలుపరాదన్నారు. నిబంధనలు పాటించకపోతే మోటార్ వాహనాల చట్టం మేరకు చర్యలు తప్పవన్నారు.

రహదారి మరమ్మతులు


గ్రావెల్ రోడ్డు పని చేస్తున్న సర్పంచ్ మణిరాజు

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం రైల్వే అండర్ బ్రిడ్జి మరమ్మతు కారణంగా మూసివేశారు. మరో రెండు నెలల వరకు అండర్ బ్రిడ్జి పనులు సాగుతాయని రైల్వే శాఖ ఆదేశాలు ఇచ్చింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏఎం పురం మీదుగా వెళ్లే గ్రావెల్ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రహదారి విషయం తెలుసుకొన్న స్థానిక సర్పంచ్ మణిరాజు ఆధ్వర్యంలో గ్రావెల్ తరలించి, గుంతలను పూడ్చే పనులు చేపట్టారు.

పన్ను చెల్లింపులపై రాయితీ


కృష్ణారెడ్డి

నగరి: పన్ను చెల్లింపులకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చిందని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి చెల్లించవలసిన ఆస్తి పన్ను ముందస్తుగా ఈ నెల 30వ తేదీలోపు చెల్లిస్తే 5% రాయితీ ఇస్తామన్నారు. ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నుల బకాయిలను ఏక మొత్తంలో చెల్లించిన వారికి 50% వడ్డీ మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 66 విడుదల చేసిందన్నారు. పురపాలక కార్యాలయంలో ప్రభుత్వ సెలవు దినాలలో కూడా కౌంటరు ఉంటుందని, పన్ను చెల్లించవచ్చన్నారు.

వేడుకగా సీతారాముల కల్యాణం



శ్రీసీతారాములు, శని భగవానుడికి ప్రత్యేక హోమాలు

గంగాధరనెల్లూరు: తూగుండ్రం గ్రామంలోని శ్రీవెంకటపెరుమాళ్ స్వామి దేవస్థానంలో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అనంతరం స్వామి, అమ్మవార్లను పల పుష్పాలతో అలంకరించారు. సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మాచర్ల వీణ ఆధ్వర్యంలో కర్ణాటక సంగీతం, హరికథ కాలక్షేపాన్ని ఆలయంలో నిర్వహించారు. మహదేవ మంగళం సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో కల్యాణోత్సవ కార్యక్రమం జగదీష్ స్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని శని భగవానుడికి ప్రత్యేక తైలాభిషేకం, హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా పౌర్ణమి పూజలు



శ్రీబాలగురునాథీశ్వర స్వామి, ప్రత్యేక దీపారాధనలో భక్తులు

పాలసముద్రం: మండలంలోని రాచపాల్యం పురాతన వటవృక్షం కింద వెలసిన శ్రీబాలగురునాథీశ్వర స్వామికి శనివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం స్వామివారి ఎదుట వివిధ యాగశాల పూజలు చేపట్టారు. మధ్యాహ్నం పంబవాయిద్యాలతో స్వామివారిని గ్రామాల్లో ఊరేగించారు. భక్తులు తీసుకొచ్చిన పూజ సామగ్రితో వేదపండితులు స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక దీపారాధన చేపట్టారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ


సోమశేఖర్ రాజు, ఇ.తులసి, ఝాన్సీరాణి, వై.జాహ్నవి | మధురమీనాక్షి, మీనా | యామిని | తనుశ్రీ | రుచిత | గిరిధర్ | పూజ | ఎ.ప్రేమ్‌కుమార్


టి.ఎస్.చత్రపతి, ఎ.ఎస్.మోహన్‌కుమార్, కె.గౌతమ్ | భువన్‌తేజ్‌తో నారాయణస్వామి | ఆర్.బి.నరసింహరాజు, భువనేశ్వరి | శివప్రసాద్ | ఎస్.వాసవి | ఎ.రేఖ | వైష్ణవి | మేనక

పాలసముద్రం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 82 శాతం ఉత్తీర్ణత సాధించారు. 72 విద్యార్థులకు 59 మంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 77 శాతం మంది విద్యార్థులు పరీక్షలో ఉతీర్ణులయ్యారు. 86 మంది విద్యార్థులకు 66 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు పాస్ అయ్యారని ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సోమశేఖర్‌రాజు 1000 మార్కులకు 972 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. ఇ.తులసి ఎంపీసీ 1000 మార్కులకు 930 మార్కులు సాధించి కళాశాలలో ద్వితీయ స్థానంలో నిలిచారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ ఝాన్సీరాణి 470 మార్కులకు 456 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. బైపీసీలో వై.జాహ్నవి 440 మార్కులకు 413 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు.

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో 98.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ నిర్మలకుమారి తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 67 మందికిగాను 66 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఒకేషనల్ గ్రూప్‌లో 38 మంది విద్యార్థులకు 34 మంది పాస్ అయినట్లు పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 91 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. 88 మందికి 80 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రకటించారు. ఒకేషనల్ గ్రూప్‌లో 28 మందికి 23 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఒకేషనల్ గ్రూప్‌లో బి, హరినాథరెడ్డి 95/1000 మార్కులు సాధించి కళాశాలకు ప్రథమ స్థానం పొందగా ఎంపీసీ గ్రూప్‌లో నితీష్ 923/1000 మార్కులు సాధించి కళాశాలకు ద్వితీయ స్థానం పొందినట్లు పేర్కొన్నారు.

60 శాతం ఉత్తీర్ణత

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్‌లో 60 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల హెచ్ఎం గాయత్రీదేవీ తెలిపారు. శనివారం వెలువడిన ఇంటర్ ద్వితీయ, ప్రథమ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి కళాశాలకు పేరు ప్రతిష్ఠలు తీసుకొచ్చారని హెచ్ఎం కొనియాడారు. ద్వితీయ సంవత్సరం బి.మధురమీనాక్షి(బైపీసీ) 951 మార్కులు, కే.మీన 928, బి.అనిత 901, అలాగే సీఈసీలో ఎం.రోహిత 841, ప్రథమ సంవత్సరం బైపీసీలో కె.రిషిత 413, ఎం.లహరి 396 మార్కులు సాధించారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో జీడీనెల్లూరు నియోజకవర్గం టాపర్‌గా పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని యామిని నిలిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యంరాజు తెలిపారు. శనివారం వెలువడిన ఇంటర్ ప్రథమ, ద్వితీత సంవత్సరం ఫలితాల్లో పెనుమూరు కళాశాల మొదటి స్థానంలో నిలిచింది. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని యామిని వెయ్యి మార్కులకు 974 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. బైపీసీ గ్రూపునకు చెందిన తనుశ్రీ 951, గిరిధర్ 949 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు 407, సీఈసీకి చెందిన పూజ 405 మార్కులు, బైపీసీలో అనూష 373 మార్కులు సాధించారని ప్రిన్సిపల్ వివరించారు. విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు భాస్కర్‌నాయుడు, రాజేంద్రన్ అభినందించారు.

పుత్తూరులో..

పుత్తూరు: ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ప్రభంజనం సృష్టించారు. పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ ఏడాది పరీక్షా ఫలితాల్లో 63 శాతం, తొలి ఏడాది ఫలితాల్లో 42 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ద్వితీయ ఏడాది విద్యార్థి ఎ.ప్రేమ్‌కుమార్ ఎంఅండ్‌ఏటీలో 1000/977 మార్కులతో కళాశాల ప్రథమ స్థానం కైవసం చేసుకొన్నట్లు వెల్లడించారు. అలాగే టీఎస్ ఛత్రపతి ఎంఅండ్‌ఏటీలో 960, ఎ.ఎస్.మోహన్‌కుమార్ ఎంపీసీ 932, శివ ఆర్అండ్ఆర్ఎం 955, లీలాప్రసాద్ ఎంపీసీ 910 మార్కులు సాధించారని వివరించారు. తొలి ఏడాది విద్యార్థి కె.గౌతమ్ ఎంఅండ్‌ఏటి 500/491 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచాడని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రిన్సిపల్ అభినందనలు తెలిపారు.

మెరిసిన భువన్‌తేజ్

కార్వేటినగరం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మనవడు, గంగాధరనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి కుమారుడు భువన్‌తేజ్ ఎంపీసీ నందు 444 మార్కులు సాధించాడు. భువన్‌తేజ్‌కు కుటుంబ సభ్యులు స్వీట్లు తినిపించి, సంతోషాన్ని పంచుకున్నారు.

సత్తా చాటిన ఆర్కేఎస్సార్

కార్వేటినగరం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఆర్కేఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 51 శాతం ఉతీర్ణత సాధించిందని ఆ కళాశాల ప్రిన్సిపల్ స్వరూప తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాల్లో కళాశాల మొత్తం 51 శాతం ఫలితాలు సాధించిందని, అందులో మొదట సంవత్సరం 46 శాతం , ద్వితీయ సంవత్సరం 57 శాతం వచ్చిందని చెప్పారు. ఇందులో భాగంగా ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి ఆర్.బీ నరసింహరాజు వెయ్యికి 906 మార్కులు సాధించి కళాశాలకు టాపర్‌గా నిలిచాడు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని ఎ.భువనేశ్వరీ 892 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారని, శివప్రసాద్ 858 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచాడని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎస్.వాసవి 470 మార్కులకు 421, ఎ.రేఖ 404 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని, ప్రథమ సంవత్సరం వొకేషనల్ కోర్సులో కె.మేనక 500 మార్కులకు 466, ద్వితీయ సంవత్సరం సీఈసీ ఆర్.వైష్ణవి వెయ్యి మార్కులకు 874, లిఖిత 441 మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ పేర్కొన్నారు.